సాక్షి
పెద్దపల్లి
శనివారం । 9 । డిసెంబర్ । 2023



రాజన్న దారిలో..
వేములవాడఅర్బన్: రాజన్న దర్శనానికి శుక్రవారం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయంలోని క్యూలైన్‌లలో బారులు తీరారు. కోడె మొక్కులు చెల్లించుకున్నారు.



మట్టిలో మాణిక్యాలు
పల్లెబిడ్డలు ఆటల్లో మెరికలు. గ్రౌండ్‌లోకి దిగితే ఎదుటి జట్టు బెంబేలెత్తాల్సిందే. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ సర్కారీ బడిపిల్లలు ఆటల్లో అదరగొడుతున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
28.0/20.0
వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. పాక్షికంగా ఎండ వస్తుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కష్టకాలంలోనే ధైర్యంగా ఉండాలి

● అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శ్యాంప్రసాద్

పెద్దపల్లిరూరల్: కష్టాలు వచ్చినప్పుడే అధైర్యపడొద్దని.. ధైర్యంగా ముందుకు సాగాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ పేర్కొన్నారు. ఆరోగ్యమిత్ర స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణపై ముద్రించిన కరపత్రాలను శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో ఆవిష్కరించి మాట్లాడారు. మానసిక ఒత్తిడి, ఒంటరితనంతో భయాందోళనలకు లోనై జీవితంపై విరక్తి చెందిన సమయాల్లో ఉన్న వారిలో మానసిక ధైర్యాన్ని నింపాలన్నారు. కష్టమొచ్చినప్పుడు ఆందోళనతో ఆత్మహత్య చేసుకోవాలనే నిర్ణయానికి రావొద్దని కోరారు. అలాంటి సమయంలో తమ ఆవేదనను స్నేహితులతో పంచుకుంటే మానసికంగా ఉపశమనం దొరుకుందన్నారు. ఆత్మహత్యలను నియంత్రించేందుకు పాటుపడుతున్న స్వచ్ఛందసంస్థ ప్రతినిధులను అభినందించారు. సైకాలజిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్, సహజ, ధనుంజయ్ తదితరులున్నారు.

ఐకానిక్ త్రీడీ ఆర్టిస్ట్ అవార్డు అందుకున్న కృష్ణ



కృష్ణకు అవార్డు అందిస్తున్న యూపీ ఎంపీ

మంథని: పట్టణానికి చెందిన త్రీడీ ఆర్టిస్ట్ ఎస్.ఎస్.ఆర్.కృష్ణ ఐకానిక్ త్రీడీ ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్ నేషనల్ అవార్డు అందుకున్నారు. న్యూఢిల్లీలో జరిగిన నేషనల్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో యూపీ ఎంపీ, మాజీ సీఎం జగదాంబిక పాల్ చేతుల మీదుగా తీసుకున్నారు. భారత్‌లో త్రీడీ కళని పెంపొందించడానికి కృష్ణ చేస్తున్న విశిష్ట సేవలను గుర్తించిన భారత్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ న్యూఢిల్లీ వారు నిర్వహించిన నేషనల్ అవార్డుల కార్యక్రమంలో కృష్ణకు ఐకానిక్ త్రీడీ ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డుతో పాటు బంగారు పతకంతో సత్కరించి అభినందించారు. త్రీడీ కళపై ఆసక్తి ఉన్న వాళ్లకు నేర్పించడానికి వర్క్‌షాప్ నిర్వహిస్తామని కృష్ణ తెలిపారు.

టీబీజీకేఎస్ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రావ్

గోదావరిఖని(రామగుండం): రాబోయే ఎన్నికల్లో టీబీజీకేఎస్ గెలుపే లక్ష్యంగా యూనియన్ శ్రేణులు ముందుకు సాగాలని ఆ యూనియన్ అధ్యక్షుడు బి.వెంకట్రావ్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రధాన చౌరస్తా సమీపంలోని యూనియన్ కేంద్ర కార్యాలయంలో రామగుండం రీజియన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. మెడికల్ ఇన్వాలిడేషన్ పేరుతో చాలా మంది యువతకు ఉద్యోగాలిప్పించిన ఘనత తమకే దక్కిందన్నారు. కోలిండియాలో లేని అనేక హక్కులను సింగరేణిలో సాధించామని పేర్కొన్నారు. నాయకులు మిర్యాల రాజిరెడ్డి, కెంగర్ల మల్లయ్య, గండ్ర దామోదర్ రావు, నూనె కొమురయ్య పాల్గొన్నారు.

13న పెద్దపల్లిలో జాబ్‌మేళా

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ కల్పనకు ఈనెల 13న ఉదయం 11 గంటలకు పెద్దపల్లిలోని ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు తెలిపారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు నిరుద్యోగ యువతీయువకులు హైదరాబాద్‌లోని అపోలో ఫార్మసీలో ఫార్మాసిస్ట్, ట్రైనీ ఫార్మాసిస్ట్, ఫార్మసీ ట్రైనీ, ఫార్మసీ అసిస్టెంట్, రిటైల్, ట్రైనీ అసోసియేట్, ప్రాడక్ట్ అడ్వైజర్ ఉద్యోగాలకు డీ-ఫార్మసీ, బీ-ఫార్మసీ, ఎం-ఫార్మసీ, డిగ్రీ, బి.బి ఎం., ఇంటర్, పదోతరగతి అర్హతలున్నవారు హాజరు కావాలన్నారు. ఇంటర్వ్యూకు వచ్చేటప్పుడు సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో రావాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు వేతనం ఉద్యోగ స్థాయిని బట్టి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 89853 36947, 95026 42441, 98858 24326 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఇక బదిలీల పర్వం!

- పోలీస్, రెవెన్యూ అధికారుల బదిలీలకు రంగం సిద్ధం
- ఎన్నికల ముందు మారిన పోలీసు బాసులు
- కొత్త హోంమంత్రి ఆధ్వర్యంలో నూతన ఐపీఎస్‌ల నియామకం?
- లెటర్ల కోసం ప్రయత్నాలు
- ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారానికి ముందే 'కమిట్‌మెంట్లు'
- కొత్త ప్రభుత్వంలోనైనా లెటర్ల సంస్కృతికి చెక్‌పడేనా?



సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ఉమ్మడి జిల్లాలో భారీగా పోలీసుల బదిలీలకు రంగం సిద్ధమవుతోంది. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం సహజంగానే తొలుత ఐపీఎస్ అధికారుల బదిలీలకు ప్రాధాన్యమిచ్చింది. ఇప్పటికే కేబినెట్ కూర్పు పూర్తవడంతో ఇక శాఖల కేటాయింపు, ఆపై ఐపీఎస్ అధికారుల బదిలీలు లాంఛనం అనే ప్రచారం జోరందుకుంది. వాస్తవానికి ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా.. తొలుత పోలీసు అధికారుల బదిలీలకే పెద్దపీట వేస్తారు. ఆ వెంటనే ఐఏఎస్, అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీవో, తహసీల్దార్ తదితర రెవెన్యూ అధికారుల బదిలీలు కూడా ఉంటాయి. రెండు, మూడు రోజుల్లో ఉమ్మడి జిల్లాలో పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు బదిలీ అవుతారని తెలిసింది. మొత్తానికి బదిలీల జాబితాలో ఎవరెవరు ఉంటారన్న చర్చ డిపార్ట్‌మెంటులో జోరుగా సాగుతోంది.

కలెక్టర్ల బదిలీలపై చర్చ

కలెక్టర్ల విషయానికొస్తే.. ఎన్నికల ముందు పెద్దపల్లి కలెక్టర్‌గా ముజమ్మిల్‌ఖాన్, సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి రెండేళ్ల కిందట బాధ్యతలు చేపట్టారు. జగిత్యాల కలెక్టర్‌గా యాస్మిన్‌బాషా ఈ ఏడాది ఫిబ్రవరిలో నియమితులయ్యారు. వీరిలో ఎవరు బదిలీ కానున్నారనే చర్చ కూడా జోరుగా సాగుతోంది. అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్ల బదిలీలు కూడా త్వరలోనే ఉంటాయని రెవెన్యూ అధికారులే వ్యాఖ్యానిస్తున్నారు.

లెటర్ల సంస్కృతికి మంగళం?

కొత్త ప్రభుత్వం ఏర్పాటుకాగానే డీఎస్పీ/ఏసీపీ ర్యాంకు నుంచి ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్ ర్యాంకు ఆఫీసర్లలో కొందరు పోస్టింగుల కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. గత ప్రభుత్వంలో చాలా మటుకు పోస్టింగులు ఎమ్మెల్యేల సిఫారసు లేఖల ద్వారానే జరిగాయన్న అపవాదు ఉంది. ఈ విషయం పలుమార్లు అప్పటి పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి సైతం వెళ్లడం, మీడియాలో కథనాలు కోకొల్లలుగా వచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు కూడా అదే సంస్కృతి వస్తుందనుకున్న అధికారులు తమకు సన్నిహితంగా ఉన్న నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఎమ్మెల్యేలు ఇంకా ప్రమాణ స్వీకారం చేయకముందే వారితో పైరవీలు ప్రారంభించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్ల, రామగుండం, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల్లో ఇంత కాలం పోస్టింగులు లేకుండా ఎదురుచూస్తున్న కొందరు పోలీసు అధికారులు ఈసారి వినూత్న విధానం అవలంబించారని సమాచారం. గెలిచే అవకాశమున్న నేతలకు ఎన్నికల్లో వెనక ఉండి, అన్ని విధాలా సాయపడ్డారని, అందుకు ప్రతిఫలంగా కొత్త సర్కారులో తమకు పోస్టింగులు వస్తాయని ధీమాగా ఉన్నట్లు తెలిసింది. ఈసారి పోలీసు పోస్టింగుల్లో అధికారపార్టీ నేతల జోక్యాన్ని నివారించేందుకు ఎస్పీలు, సీపీలకే పూర్తిస్థాయి స్వేచ్ఛను ఇచ్చే దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ పరిణామాన్ని సీనియర్ పోలీసు అధికారులు స్వాగతిస్తున్నారు. దీంతో ప్రతిభావంతులకు పోస్టింగులు దక్కుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నలుగురిలో బదిలీ ఎవరికో?

ఒక ప్రభుత్వం నియమించిన ఐపీఎస్ అధికారులను తరువాత వచ్చిన ప్రభుత్వం సహజంగానే మారుస్తుంది. ఎన్నికల సమయంలో ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చిన అధికారులను ఎన్నికల సంఘం కూడా బదిలీ చేస్తుంది. ఈక్రమంలోనే సరిగ్గా ఎన్నికల ముందు అక్టోబర్ 27న అప్పటి కరీంనగర్ సీపీ సుబ్బారాయుడును ఎన్నికల సంఘం బదిలీ చేసి, ఆ స్థానంలో అభిషేక్ మహంతికి పోస్టింగ్ ఇచ్చింది. కరీంనగర్ కలెక్టర్ బి.గోపి స్థానంలో ప్రస్తుత కలెక్టర్ పమేలా సత్పతికి పోస్టింగ్ కల్పించింది. జగిత్యాల ఎస్పీ భాస్కరన్ స్థానంలో సన్‌ప్రీత్‌సింగ్‌కు బాధ్యతలు అప్పగించింది. ఇక సిరిసిల్ల ఎస్పీగా అఖిల్ మహాజన్, రామగుండం సీపీగా రెమా రాజేశ్వరీ కొనసాగుతున్నారు. ఎన్నికల సంఘం దాదాపు మెజారిటీ ఐపీఎస్‌లపై బదిలీవేటు వేసినా అఖిల్‌మహాజన్, రెమా రాజేశ్వరీలను కొనసాగించేందుకే మొగ్గుచూపింది. కొత్త ప్రభుత్వంలో ఈ నలుగురిలో ఎవరు బదిలీ అవుతారన్నది ఆసక్తికరంగా మారింది.

సీఐటీయూని గెలిపించాలి



మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

రామగిరి: సింగరేణి కార్మికుల సంక్షేమమే సీఐటీయూ ధ్యేయమని, కార్మికుల పక్షాన నిరంతరం పోరాటం చేస్తున్న సీఐటీయూని ఆదరించాలని రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి కోరారు. శుక్రవారం ఏపీఏ గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికుల సొంత ఇంటి పథకంపై పోరాటం చేస్తున్నామని, విద్య, ఆసుపత్రులు, మంచినీటి వంటి ప్రధాన సమస్యలపై కార్మికుల పక్షాన పోరాటం చేస్తున్న ఏకైక సంఘం సీఐటీయూ మాత్రమేనన్నారు. పైరవీలకు ప్రాధాన్యం ఇచ్చే యూనియన్‌లను చిత్తుగా ఓడించి కార్మికుల సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఐటీయూని గెలిపించాలని కార్మికులను విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, బ్రాంచ్ సెక్రటరీ దొమ్మటి కొమురయ్య, పిట్ సెక్రటరీ దేవర రవికుమార్, నాయకులు వెంకటేశ్వర్లు, అహ్మద్ పాషా, కె.వేణుగోపాల్, ఎం.ప్రభాకర్, రవి, రంజిత్, జయరాం, రాజేశ్ పాల్గొన్నారు.

కోలిండియా ఒప్పందాలు అమలు చేస్తాం



మాట్లాడుతున్న రాజారెడ్డి

గోదావరిఖని(రామగుండం): రాబోయే సింగరేణి ఎన్నికల్లో తమ యూనియన్‌ను గెలిపిస్తే కోలిండియా ఒప్పందాలను సింగరేణిలో అమలు చేస్తామని సీఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజా రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జీడీకే-2ఏ గనిపై ఏర్పాటు చేసిన మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గతంలో గెలిచిన సంఘాలు కోలిండియాలో జరిగిన బొగ్గుగని కార్మికుల ఒప్పందాలను అమలు చేయించడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. కార్మికులకు ఎలాంటి నష్టం లేకుండా మినిమం ప్రతి ఏటా రూ.80వేలు లాభదాయకమైన అగ్రిమెంట్లను అమలు చేయిస్తామన్నారు. సమావేశంలో నాయకులు మెండె శ్రీనివాస్, మహేశ్, విజయ్, వేణుగోపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలి



పర్యటిస్తున్న ఎంఈసీఎల్ డైరెక్టర్ పంకజ్ పాండే

రామగిరి: టెక్నాలజీ ద్వారా రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని, ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని ఎంఈసీఎల్ డైరెక్టర్ పంకజ్ పాండే అన్నారు. ఆర్జీ-3 డివిజన్, ఏపీఏ ఏరియాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఆర్జీ-3 ఏరియాలోని ఓసీపీ-2 గనిని సందర్శించి వ్యూ పాయింట్ నుంచి పనులను పరిశీలించారు. గనిలోని ఇన్‌పిట్ క్రషర్, స్ప్రెడర్‌లను పరిశీలించారు. అలాగే ఏపీఏ గనిలోని ఎయిర్ చిల్లింగ్ ప్లాంట్‌ను సందర్శించారు. అనంతరం ఆర్జీ-3 జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గనుల్లో ఉపయోగిస్తున్న అత్యుత్తమ టెక్నాలజీ గల యంత్రాల పనితీరు బాగుందన్నారు. ఆర్జీ-3 జీఎం ఎస్.సుధాకర్‌రావు, ఏరియా ఇంజనీర్ పి.ఎలీషా, ప్రాజెక్టు అధికారి కె.రాజేందర్, ప్రాజెక్టు ఇంజనీర్ ఎం.నాగరాజు, ఎస్‌వోఎం కె.జనార్దన్, జియాలజిస్ట్ శివనారాయణ, సర్వే అధికారి లక్ష్మిరాజు, సేఫ్టీ అధికారి ఆసిఫ్ యాసిన్ ఉన్నారు.

హక్కుల కోసం పోరాడే సంఘం ఏఐటీయూసీ



కార్మికులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీతారామయ్య

గోదావరిఖని(రామగుండం): అధికార పార్టీతో మనుగడ సాధించే సంఘాలు సింగరేణిలో హక్కులు సాధించలేవని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శుక్రవారం జీడీకే-2వ గని, ఓసీపీ-5లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్ మాట్లాడారు. కార్మికుల హక్కుల కోసం పోరాడే సంఘం ఏఐటీయూసీ అన్నారు. 27న జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో తమ యూనియన్‌ను గెలిపించాలని కోరారు. సింగరేణిలో కార్మికుల హక్కుల కోసం పోరాడుతామన్నారు.మడ్డి ఎల్లాగౌడ్, కె.స్వామి, ఏ.పోశం, రామస్వామి, వెంకటయ్య ఉన్నారు.

ఏఐటీయూసీ గెలుపుతోనే భవిష్యత్

ఏఐటీయూసీ గెలుపుతోనే సింగరేణి భవిష్యత్ ఉందని యూనియన్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఎల్.ప్రకాశ్ అన్నారు. శుక్రవారం ఆర్జీ-2 ఏరియా ఓసీపీ-3 సీహెచ్‌పీలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సమర్థవంతమైన నాయకత్వం కలిగిన ఏఐటీయూసీ ద్వారానే హక్కులు రక్షించబడతాయన్నారు. నాయకులు రాజరత్నం, బుర్ర తిరుపతి, అన్నారావు పాల్గొన్నారు.

అవిశ్వాసం వైపు అడుగులు!

- పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపాలిటీలపై కాంగ్రెస్ గురి
- ఎన్నికల వేళ మెజార్టీ కౌన్సిలర్లు జంపింగ్ కావడమే కారణం
- చైర్మన్లకు వ్యతిరేకంగా ఒక్కటవుతున్న కౌన్సిలర్లు



సాక్షి, పెద్దపల్లి: ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో రాజకీయ వేడి తగ్గుతున్న వేళ.. అవిశ్వాసం అంశం తెరమీదకు వచ్చింది. దీంతో జిల్లాలో రాజకీయ వేడి ఇప్పట్లో తగ్గేలా కనిపించడం లేదు. జిల్లాలో రామగుండం కార్పొరేషన్‌తో పాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలు ఉన్నాయి. కాగా ఆయా మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన పలువురు కౌన్సిలర్లు, అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరి కండువా కప్పుకున్నారు. వారిలో చాలామంది మున్సిపల్ చైర్మన్ పదవి ఆశించి జెండా మార్చారు. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దీంతో అవిశ్వాసంతో ప్రస్తుత చైర్మన్లకు షాక్ ఇచ్చేందుకు ఆయా మున్సిపాలిటీల్లోని కౌన్సిలర్లు అందరూ ఏకమవుతున్నట్లు సమాచారం.

ఏకపక్ష నిర్ణయాలతోనే..

పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కోడలు మమతారెడ్డి ఎన్నికయ్యారు. మున్సిపల్‌లో ఎమ్మెల్యే జోక్యం, వారి కుటుంబ పెత్తనం, ఏకపక్ష నిర్ణయాలతో కొద్దిరోజులుగా ఇబ్బంది పడుతున్న పలువురు కౌన్సిలర్లు ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరారు. సుల్తానాబాద్‌లో సైతం బిరుదురాజమల్లు కోడలు బిరుదు సమత ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఎన్నికల ముందే బిరుదు సమత చైర్మన్ కోసం 5గురు కాంగ్రెస్, 8మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లతో కలిసి ప్రయత్నాలు చేయడంతో పాటు అవిశ్వాసం తీర్మానం కోసం కలెక్టర్‌ను కలిశారు. అయితే అప్పుడు బీఆర్ఎస్ అధికారంలో ఉండడంతో అప్పటి ఎమ్మెల్యే అవిశ్వాసంపై నీళ్లు చల్లారు. ప్రస్తుతం మారిన రాజకీయ పరిణామాలతో అవిశ్వాసం మరోసారి తెరపైకి వచ్చింది.

పెద్దపల్లి మున్సిపాలిటీతో మొదలు..

పెద్దపల్లి మున్సిపాలిటీకి 2019లో జరిగిన ఎన్నికల్లో 36 స్థానాలకు 24 స్థానాలు బీఆర్ఎస్, 05 కాంగ్రెస్, బీజేపీ 2, ఎంఐఎం 2, ఏఐఎఫ్‌బీ 1, ఇండిపెండెంట్ అభ్యర్థులు 2 గెలుపొందారు. అయితే ఇటీవల పలువురు కౌన్సిలర్లు బీఎస్పీలో చేరడంతో పెద్దపల్లి మున్సిపాలిటీలో బీఎస్పీకి 5గురు, కాంగ్రెస్‌కు 10మంది కౌన్సిలర్లు ఉన్నట్లు అయ్యింది. ప్రస్తుతం బీఆర్ఎస్‌కు సంఖ్యాపరంగా 19మంది ఉన్నా, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో వారిలో మెజార్టీ సభ్యులు కాంగ్రెస్ టచ్‌లోకి వెళ్లారు. చైర్మన్ పదవి ఆశిస్తున్న ఆశావహులు ఇప్పటికే వారితో మంతనాలు సాగిస్తున్నారు. మరో వారంరోజుల్లో అవిశ్వాస తీర్మానంపై కలెక్టర్‌ను కలిసేందుకు అడుగులు వేస్తున్నట్లు సమాచారం. ముందుగా పెద్దపల్లి మున్సిపాలిటీపై అవిశ్వాస తీర్మానం పెట్టి, తదుపరి సుల్తానాబాద్ మున్సిపాలిటీలో సైతం అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు అక్కడి కౌన్సిలర్లు అందరూ ఏకమవుతుండటం జిల్లాలో రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత



ఆర్థికసాయం అందిస్తున్న తోటి కానిస్టేబుళ్లు

గోదావరిఖని(రామగుండం): గోదావరిఖని వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో చనిపోయిన హెడ్ కానిస్టేబుల్ దేవయ్య కుటుంబానికి తోటి బ్యాచ్ కానిస్టేబుళ్లు అండగా నిలిచారు. శుక్రవారం పెద్దపల్లిలో దేవయ్య కుటుంబానికి 2000 సంవత్సరం పోలీసుకానిస్టేబుల్ బ్యాచ్‌కి చెందిన మిత్రులందరూ కలిసి రూ.2.65లక్షలు ఆర్థికసాయం అందించారు. సంపత్‌రెడ్డి, లక్ష్మి పతి, ఏలీయా, సాంబరెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

నియామకం



నియామకపత్రం అందుకుంటున్న శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: జిల్లా హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శిగా పెద్దపల్లి మండలం అప్పన్నపేటకు చెందిన గుండ్రాతి శ్రీనివాస్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు ఈదునూరి శంకర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నియామక పత్రాన్ని అందించారు.

నమ్మకం కలిగేలా బోధించాలి

• కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధనపై తల్లిదండ్రులు, విద్యార్థులకు నమ్మకం కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు. విద్యార్థుల హాజరుశాతం పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కలెక్టరేట్‌లోని క్యాంప్ ఆఫీస్‌లో శుక్రవారం ఎంపిక చేసిన ఐదు పాఠశాలల హెచ్‌ఎంలతో కలెక్టర్ సమీక్షించారు. సర్కార్ బడుల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచేలా చూడాలన్నారు. తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించాలని తెలిపారు. లెసన్‌ప్లాన్, టీఎల్‌ఎంలను ఉపయోగించి పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. తరగతిగదిలో విద్యార్థులు నేర్చుకున్న అంశాలు, వారు చేసిన, చేయాల్సిన కృత్యాల గురించి తల్లిదండ్రులకు వాట్సాప్ ద్వారా తెలియజేయాలన్నారు. పాఠశాలలో నిర్వహిస్తున్న కిచెన్‌గార్డెన్ ద్వారా వచ్చే కూరగాయలను మధ్యాహ్న భోజనంలో ఉపయోగించాలని తెలిపారు. ఈనెలాఖరున తొలిమెట్టు, ఉన్నతి లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాంపై సమీక్ష ఉంటుందని చెప్పారు. అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పీఎం షేక్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుపై సంబరాలు



మిఠాయిలు పంచి సంబరాలు చేసుకుంటున్న టీఎన్జీవో సంఘం నాయకులు

• మిఠాయిలు పంచిన టీఎన్జీవోలు

పెద్దపల్లిరూరల్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టడంతో పెద్దపల్లిలో శుక్రవారం టీఎన్జీవోల ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్‌కు శుభ పరిణామమన్నారు. శ్రీధర్‌బాబుకు మంత్రి పదవి దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కలెక్టరేట్‌లోని ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు సందీప్‌రావు, సుధీర్, ఆడెపు శ్రీనివాస్, కొమురయ్య, మహేందర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, ప్రవీణ్, సురేశ్, రాజేందర్, శ్రీకాంత్, రాజారత్నం, ప్రేమ్ తదితరులున్నారు.

క్లుప్తంగా

టీఎస్‌సెట్‌కు అర్హత సాధించిన రేగుంట వాసి



వెంకట సాయికృష్ణ

మల్లాపూర్: ఉస్మానియ విశ్వవిద్యాలయం విడుదల చేసిన టీఎస్ సెట్ ఫలితాల్లో మల్లాపూర్ మండలం రేగుంటకు చెందిన రాజోజి వెంకటసాయికృష్ణ అర్హత సాధించాడు. గత ఆగస్టులో టీఎస్‌సెట్ నోటిఫికేషన్ విడుదల కాగా.. అక్టోబర్ 28న అర్హత పరీక్ష నిర్వహించారు. డిసెంబర్ 6న విడుదలైన ఫలితాల్లో వెంకటసాయికృష్ణ ప్రతిభ కనబరిచి సెట్‌లో అర్హత సాధించాడు. ప్రస్తుతం వెంకటసాయికృష్ణ జగిత్యాల జిల్లాకేంద్రంలోని ఓ ప్రయివేటు డిగ్రీ కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. సెట్‌లో అర్హత సాధించిన వెంకటసాయికృష్ణను జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, వైస్‌ఎంపీపీ గౌరు నగేశ్, రైతుబంధు కమిటీ జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, సర్పంచ్ కుందేల్ల నర్సయ్య తదితరులు అభినందించారు.

కేసీఆర్ సర్జరీ వైద్యబృందంలో కోరుట్ల ఎమ్మెల్యే..

మెట్‌పల్లి: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నిర్వహించిన హిప్ రిప్లేస్‌మెంట్ సర్జరీలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు. ఎర్రవెల్లిలోని తన ఫాంహౌజ్‌లో గురువారం రాత్రి జారిపడడంతో కేసీఆర్ తొంటికి గాయాలైన సంగతి తెలిసిందే. ఈ మేరకు యశోద ఆసుపత్రిలో చేర్పించగా.. వైద్య బృందం సర్జరీ నిర్వహించారు. ఈ బృందంలో కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కూడా పాల్గొన్నారు.

మిడ్‌మానేరులో 23 టీఎంసీలు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టులో నీటిమట్టం 23.39 టీఎంసీలకు చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో లేదని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

స్వాతంత్య్ర సమరయోధురాలి మృతి



లసుమమ్మ (ఫైల్)

హుజూరాబాద్‌రూరల్: కాట్రపల్లి గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధురాలు లసుమమ్మ(95) అనే వృద్ధురాలు అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్: ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 26 నుంచి హౌస్ వైరింగ్(పురుషులకు)లో 30 రోజుల ఉచిత శిక్షణ ప్రారంభమవుతుందని సంస్థ డైరెక్టర్ డి.సంపత్ తెలిపారు. ఆసక్తిగలవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. అభ్యర్థులు ఉమ్మడి కరీంనగర్ (పెద్దపల్లి, సిరిసిల్ల జగిత్యాల, కరీంనగర్) జిల్లాలకు చెందినవారై ఉండాలని, శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి ఉంటుందని తెలిపారు. శిక్షణ అనంతరం టూల్స్, యూనిఫామ్ ధ్రువీకరణ పత్రం అందిస్తామన్నారు. దరఖాస్తుదారుల వయసు 18 ఏళ్ల నుంచి 45 ఏళ్లలోపు ఉండాలని సూచించారు. దరఖాస్తు ఫామ్‌తోపాటు ఎస్సెస్సీ మెమో, తెల్ల రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతోపాటు నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జతపర్చాలని సూచించారు.

మట్టిలో మాణిక్యాలు

- సర్కారీ బడి పిల్లలు.. ఆటల్లో మెరికలు
- పల్లె నుంచి జాతీయస్థాయికి..
- ప్రతిభ చూపుతున్న విద్యార్థులు
- చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తున్న పల్లెబిడ్డలు



వాలీబాల్ బాలికల జట్టు



వాలీబాల్ బాలుర జట్టు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వారంతా రైతుబిడ్డలు. మైదానంలో దిగితే మాత్రం చిరుతలే. వాలీబాల్ కోర్టులో షాట్ కొడితే పాయింట్ రావాల్సిందే.. ఖోఖో కోర్టులో అడుగుపెడితే ప్రత్యర్థి ఔట్ కావాల్సిందే.. ఇదంతా రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభకు తార్కాణం. సామన్య కుటుంబాల నుంచి వచ్చిన పిల్లలు, తమలోని టాలెంట్‌కు పదునుపెట్టి రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదిగారు. సర్కార్‌బడి పిల్లలు ఎందులోనూ తక్కువ కాదంటూ నిరూపించారు.

ఆడితే కప్పు కొట్టుడే

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలలో రాణిస్తున్నారు. ప్రతీ క్రీడలో సత్తా చాటుతూ కప్పు కొడుతున్నారు. పీఈటీగా ప్రభాకర్ 2018లో ఈ స్కూల్‌కు వచ్చారు. అప్పటి నుంచి నిత్యం ఉదయం, సాయంత్రం కఠోర శిక్షణతో వందలాది మంది విద్యార్థులు మెరికల్లా తయారయ్యారు. ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. పాఠశాల నుంచి 35 మంది రాష్ట్రస్థాయికి ఎంపికై ప్రతిభ చూపడమే కాకుండా.. ముత్యాల మనోజ్ వాలీబాల్‌లో జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. కరోనా సమయంలో కొంత బ్రేక్ వచ్చినప్పటికీ పట్టువదలని విక్రమార్కుడిలా నిత్య కఠోర సాధన చేస్తూ ఆటల్లో రాణిస్తున్నాడు.

ఆడిన చోట.. గెలుపు బాట

- 2018లో సాధన మొదలుపెట్టారు.
- 2019, 2020లలో మంచిర్యాలలో రాష్ట్రస్థాయి వాలీబాల్, చెస్ పోటీలలో విష్ణు, శ్వేత ప్రతిభ చూపారు.
- 2020–21లో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో జి.లయ, ఎం.అరవింద్, ఎండీ.సాయిబ్, ఎల్.అనూషలు పాల్గొన్నారు.
- 2021–22లో సిద్దిపేటలో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో ఎం.ఐశ్వర్య, ఎస్.వైష్ణవి, బి.శ్రీలత, పి.శనూష పతకాలు సాధించారు.
- 2022–23లో మహబూబ్‌నగర్‌లో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో డి.శ్రీజ, ఎ.సంయుక్త రాణించారు.
- 2022–23లో వరంగల్‌లో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో డి.శ్రీజ, ఎం.మనోజ్, డి.శివకుమార్ పతకాలు సాధించారు
- 2022–23లో మెదక్‌లో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో ఎ.మనోజ్, లక్ష్మీచైతన్య, రవికాంత్ పతకాలు సాధించారు.
- 2023–24లో హన్మకొండలో అథ్లెటిక్స్‌లో సీహెచ్.సాహితి, రవికాంత్, ఎ.సంయుక్త పతకాలు సాధించారు.
- 2023–24లో పశ్చిమబెంగాల్‌లో వాలీబాల్ పోటీలలో ఎం.మనోజ్ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు.
- 2023–24లో మహబూబ్‌నగర్‌లో వాలీబాల్ పోటీలలో సీహెచ్.సాహితీ, ఎం.శ్రీహర్ష పతకాలు సాధించారు. అదే సంవత్సరంలో ఎం.మనోజ్, ఏ.మనోజ్ వాలీబాల్‌లో ప్రతిభ కనబర్చారు.
- 2023 సీఎం కప్ చాంపియన్‌షిప్‌ను రాచర్ల బొప్పాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు దక్కించుకున్నారు.

విద్యార్థుల్లో టాలెంట్ ఉంది



మా స్కూల్ విద్యార్థుల్లో చాలా టాలెంట్ ఉంది. స్కూల్‌లోనే నిత్యం ఉదయం, సాయంత్రం శిక్షణ ఇస్తున్నా. కఠిన శిక్షణను తట్టుకున్నారు కాబట్టే ఏ స్థాయిలో ఆడినా విజయం సాధిస్తున్నారు. మరిన్ని విజయాలే లక్ష్యంగా ముందుకెళ్తాం.

– ప్రభాకర్, పీఈటీ, రాచర్లబొప్పాపూర్ హైస్కూల్



ఫ్రీడమ్ కప్‌తో పాఠశాల క్రీడాకారులు

సార్ ప్రోత్సాహంతో..



పీఈటీ ప్రభాకర్ సార్ ప్రోత్సాహంతో నేషనల్ స్థాయికి ఎంపికయ్యాను. పాఠశాలలో నిత్యం ఉదయం, సాయంత్రం పట్టుదలతో వాలీబాల్‌లో సాధన చేసి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలలో సత్తాచాటాం. జాతీయస్థాయికి ఎంపికవడం సంతోషంగా ఉంది.

– ముత్యాల మనోజ్, వాలీబాల్ నేషనల్ ప్లేయర్

అవకాశాలను అందిపుచ్చుకొని..



పాఠశాల స్థాయిలో అందివచ్చిన అవకాశాలను వినియోగించుకొని వాలీబాల్‌లో రాణించాను. జిల్లా స్థాయిలో నిర్వహించిన సీఎం కప్ పోటీలలో చాంపియన్‌షిప్ గెలుచుకున్నాం. ప్రతిభను గుర్తించి రాష్ట్రస్థాయికి ఎంపిక చే యగా, మహబూబ్‌నగర్‌లో జరిగిన క్రీడాపోటీలలో పతకాలు సాధించాం.

– ముత్యాల శ్రీహర్ష, స్టేట్ లెవల్ వాలీబాల్ ప్లేయర్

కఠోరశ్రమతో..



నిత్యం స్కూల్‌లో చేసిన ప్రాక్టీస్‌తోనే రా ష్ట్రస్థాయిలో రాణించగలిగాం. చదువుతో పాటు క్రీడలపై దృష్టి పెట్టాం. మొదట్లో ఆడడం ఇబ్బందిగా ఉన్నప్పటికీ తల్లిదండ్రులు, సార్ల ప్రోత్సాహంతో ముందకెళ్లాం. మేము పడ్డ శ్రమకు తగిన ఫలితం దక్కింది.

– పల్లె సంయుక్త, రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ప్లేయర్

జాతీయస్థాయి లక్ష్యంగా..



జాతీయస్థాయికి ఎంపికవడమే లక్ష్యంగా ప్రాక్టీస్ చేస్తున్నాం. ప్రభుత్వ బడి అయినప్పటికీ మా దగ్గర ఉన్న వసతులతోనే జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని పతకాలు సాధిస్తున్నాం. మా ఊరి పేరును నిలబెడుతాం.

– బి.శివ, వాలీబాల్ ప్లేయర్

చెట్టును ఢీకొని యువకుడి దుర్మరణం



పర్శరాములు(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని ఆవునూర్ శివారులో వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు. ఎల్లారెడ్డిపేట మండలం అగ్రహారం గ్రామానికి చెందిన కూరాకుల ఎల్లవ్వ, దేవరాజు దంపతుల కుమారుడు పర్శరాములు(27) గురువారం రాత్రి గూడెంలోని రైస్‌మిల్లుకు బైక్‌పై వచ్చాడు. మిల్లులో తాడు తీసుకుని తిరుగు ప్రయాణంలో వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో పర్శరాములు రోడ్డు కింద పడిపోయాడు. రాత్రయినా కొడుకు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఎంత వెతికిన పర్శరాములు కనిపించలేదు. శుక్రవారం ఉదయం గ్రామస్తులు గమనించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. పర్శరాములు నాలుగేళ్లు దుబాయ్‌కు వెళ్లి ఇటీవల వచ్చాడు. వెంకటాపూర్‌లో వెల్డింగ్ పనులు చేస్తుండేవాడు. పర్శరాములు మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మృతుడి తండ్రి దేవరాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బహ్రెయిన్‌లో ప్రమాదం.. బావుసాయిపేట వాసి మృతి



బాబు(ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): ఉపాధి కోసం పరాయిదేశం వెళ్లిన ఓ యువకుడు అక్కడ జరిగిన ప్రమాదానికి బలయ్యాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన లింగంపెల్లి రాజనర్సయ్య–లచ్చవ్వల కుమారుడు బాబు నెల రోజుల క్రితం బహ్రెయిన్‌కు వెళ్లాడు. అక్కడి ఓ కంపెనీలో పనిచేస్తుండగా గురువారం సెంట్రింగ్ పనికి వినియోగించే పెద్దరాడ్ నాలుగో అంతస్తు మీది నుంచి బాబుపై పడింది. దీంతో బాబు అక్కడికక్కడే మృతిచెందినట్లు తోటి స్నేహితులు గ్రామస్తులకు సమాచారం అందించారు. మృతుని తండ్రి రాజనర్సయ్య కొన్నేళ్ల క్రితమే చనిపోయాడు. తల్లి లచ్చవ్వ, భార్య శిరీష, కుమారుడు(4) ఉన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు



మృతిచెందిన దండు సంజయ్(ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): శుభకార్యానికి వెళ్లివస్తుండగా జరిగిన ప్రమాదంలో యువకుడు మృతిచెందగా, మరో యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. కోనరావుపేటకు చెందిన దండు రవి–రమ దంపతుల కుమారుడు సంజయ్(22), అతని స్నేహితుడు గాజుల శకుంతల కుమారుడు వినయ్ గురువారం రాత్రి మర్తనపేటలో ఓ శుభకార్యానికి వెళ్లారు. అదే రాత్రి తిరిగి వస్తుండగా ధర్మారం శివారులోని రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న కోనరావుపేట గ్రామస్తులు వెంటనే చేరుకుని ఇద్దరిని కరీంనగర్ తరలించారు. కానీ అప్పటికే సంజయ్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. తీవ్రంగా గాయపడ్డ వినయ్‌కి చికిత్స అందిస్తున్నారు. కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు కేసు నమోదు చేసి, విచారణ చేపడుతున్నారు.

బావిలో పడి యువకుడు మృతి

వెల్గటూర్: ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామంలో ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సమీపంలో గల మామిడితోటలో ధర్మారం మండల కేంద్రానికి చెందిన బొలిశెట్టి అచ్యుత్(28) శుక్రవారం స్నేహితులతో కలిసి విందులో పాల్గొన్నాడు. బహిర్భూమికి వెళ్లివస్తానని తోటలోని బావి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో జారిపడ్డాడు. అచ్యుత్ ఎంతసేపటికీ రాకపోవడంతో స్నేహితులు వెళ్లి చూడగా బావి వద్ద అతని చెప్పులు ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల సమక్షంలో బావిలో గాలించగా చాలాసేపటికి మృతదేహం బావిలో లభ్యమైంది. మృతదేహాన్ని బావినుండి వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. మృతుడి తండ్రి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్వేత తెలిపారు.



అచ్యుత్ మృతదేహం

సీపీఐ మావోయిస్టు దళ సభ్యుడి అరెస్ట్

- రామగుండం పోలీస్‌కమిషనర్ రెమా రాజేశ్వరి



అరెస్ట్ చూపిస్తున్న రెమా రాజేశ్వరి

గోదావరిఖని: సీపీఐ మావోయిస్టుపార్టీ దళ సభ్యుడు పామిడిమల్ల అవినాశ్ అలియాస్ మల్లేశ్‌ను అరెస్ట్ చేసినట్లు రామగుండం పోలీస్‌కమిషనర్ రెమా రాజేశ్వరి తెలిపారు. కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శుక్రవారం అవినాశ్ అరెస్ట్‌ను చూపించారు. ఈ సందర్భంగా పలు విషయాలు వెల్లడించారు. సీపీఐ మావోయిస్ట్ పార్టీ కోల్‌బెల్ట్ ఏరియాలో తన ప్రాభవాన్ని పునరుద్ధరించుకోవడానికి చేసే ప్రయత్నాల్లో భాగంగా సికాస కార్యకలాపాలు విస్తరించడానికి గోదావరిఖనికి వచ్చిన మావోయిస్టు పార్టీ సభ్యుడిని అరెస్ట్ చేసినట్లు వివరించారు. ఈనెల 8న వేకువజామున ఒంటిగంట ప్రాంతంలో గోదావరిఖని ఆర్జీ–1 జీఎం ఆఫీస్ జంక్షన్ వద్ద పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, ఓ వ్యక్తి చేతిలో సంచితో సీఎస్పీకాలనీ వైపువెళ్తూ పోలీసులకు కనిపించాడన్నారు. అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు సమీపించగా పారిపోయే ప్రయత్నం చేశాడన్నారు. వెంటనే అప్రమత్తమై అతన్ని పట్టుకుని విచారించగా పార్టీ ఆదేశాలతో గోదావరిఖనికి వచ్చినట్టు తెలిపినట్లు సీపీ వెల్లడించారు. బీఎస్సీ నర్సింగ్ చేసిన అవినాశ్ తన గ్రామంలో ప్రింటింగ్‌ప్రెస్ నడుపుతూ ఉండేవాడని, ఈ క్రమంలో ప్రజా సంఘాల కరపత్రాల ముద్రణ కోసం వచ్చివెళ్లేవారన్నారు. ఈ పరిచయం ద్వారా సీపీఐ మావోయిస్టు పార్టీతో సంబంధాలు ఏర్పడి వారి భావజాలంపై ఆకర్షితుడయ్యాడని వివరించారు. రెండేళ్ల క్రితం పార్టీలో చేరి పనిచేస్తున్నాడన్నారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీ సింగరేణి కార్మిక సమాఖ్య విభాగం ఆదేశాల మేరకు ఇక్కడకు వచ్చాడన్నారు. అతని నుంచి వాల్‌పోస్టర్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాస్, వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు పాల్గొన్నారు.

బొగ్గుబాయి

కార్మిక సమస్యల పరిష్కారానికి పోరాటం



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

రామగిరి: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం ఏఐటీయూసీ పోరాటం చేస్తుందని జనరల్ సెక్రటరీ రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2, జీఎం కార్యాలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు. కార్మికుల హక్కుల సాధన, సంక్షేమం కేవలం ఏఐటీయూసీతోనే సాధ్యమని, కార్మికులందరూ ఏఐటీయూసీకి మద్దతు పలకాలని కోరారు. కార్మికుల సంక్షేమం, ఐటీ మినహాయింపుతో పాటు అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. టీబీజీకేఎస్ సంఘం యాజమాన్యం తొత్తుగా మారి కార్మికుల హక్కులను కాలరాసిందని ఆరోపించారు. సింగరేణిలో కొత్త గనుల ఏర్పాటు, ఉద్యోగాల కల్పన కోసం పోరాడుతామని, ఏఐటీయూసీని గెలిపించాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. సెంట్రల్ సెక్రటరీ జూపాక రాంచందర్, ఆర్జీ–3 బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్‌సీ రెడ్డి, ఫీట్ సెక్రటరీ మర్రి రాజు, వర్క్‌షాప్ సెక్రటరీ ఎ.పోచం, పోల్ కనకయ్య, సదానందం, పోశం, ఎండీ శ్యామ్, ఎస్.సురేందర్, ఎం.వెంకటేశ్వర్లు, సాంబశివరెడ్డి, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ ప్రదర్శనకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

రామడుగు(చొప్పదండి): మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థి ఎం.సాయివినీల్ ఆటోమేటెడ్ డ్రైనేజీ క్లీనర్ ప్రాజెక్టును రూపొందించాడు. ఇది జాతీయస్థాయి రాష్ట్రీయ బాలల వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైంది. ఈ నెల 26 నుంచి మహారాష్ట్రలోని పుణేలో జాతీయ సైన్స్ ప్రదర్శన నిర్వహించనున్నారు. సాయివినీల్‌ను అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు గురిచేస్తే చర్యలు



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగినులను లైంగిక వేధింపులకు గురిచేస్తే చట్టపరంగా చర్యలుంటాయని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జీఎం కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, సంస్కరణ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులపై ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అధికారులు రామ్మోహన్, పర్సనల్ ఏజీఎం లక్ష్మీనారాయణ, సీనియర్ పీవో శ్రావణ్‌కుమార్, కమిటీ సభ్యులు లా ఆఫీసర్ అఫ్రీన్ సుల్తానా పాల్గొన్నారు.

తండ్రిని చంపిన తనయుడు



నర్సయ్య (ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్: క్షణికావేశంలో కొడుకు తండ్రిని బండరాయితో తలపై మోది చంపిన సంఘటన సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని పూసాలలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై విజేందర్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పూసాలకు చెందిన తీగల నర్సయ్య(74) పూసాలలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో వరిధాన్యం పోశాడు. మాయిశ్చర్ రాకపోవడంతో శుక్రవారం వరిధాన్యం ఆరబోసే విషయంలో కొడుకు రాజేశంతో గొడవ జరిగింది. క్షణికావేశానికి గురైన కొడుకు తండ్రిని బండరాయితో తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య భూదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కొడుకులు కాగా పెద్దకొడుకు ఈ అఘాత్యానికి పాల్పడ్డాడు. నిందితుడు పరారీలో ఉన్నాడని పోలీసులు పేర్కొన్నారు.

గంజాయి స్వాధీనం

గోదావరిఖని(రామగుండం): గంజాయిని నిల్వ ఉంచిన యువకుడిని రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు స్థానిక పరశురాంనగర్‌కు చెందిన ఎండీ గౌస్‌పాషా(19) ఇంటిని తనిఖీ చేయగా 450 గ్రాముల పొడిగంజాయి లభించిందన్నారు. దీని విలువ సుమారు రూ.10వేలు ఉంటుందన్నారు. గౌస్ మహారాష్ట్ర బల్హార్షలో కొనుగోలు చేసి గోదావరిఖని ప్రాంతంలోని యువతకు ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు తెలిపారు. గంజాయి స్వాధీనం చేసుకొని తదుపరి విచారణకు గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేర్కొన్నారు.

రెండిళ్లలో చోరీ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇందిరమ్మకాలనీలో రెండిళ్లలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన బీడీ కార్మికురాలు వేల్ల లావణ్య, ఓబులాపూర్‌లో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న కొమ్మెట నవీన ఇళ్లకు తాళాలు వేసి ఇతర గ్రామాలకు వెళ్లారు. శుక్రవారం దొంగతనం జరిగినట్లు చుట్టుపక్కల వారు గుర్తించి తంగళ్లపల్లి పోలీసులకు సమాచారం అందించారు. లావణ్య కుటుంబం ఈ మూడు రోజుల క్రితం దైవదర్శనానికి తుల్జాపూర్ వెళ్లగా.. కొమ్మెట నవీన కుటుంబం గురువారం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికెళ్లింది. ఇదే అదునుగా భావించిన దొంగలు రెండిళ్లలో చోరీకి తెగబడ్డారు. నవీన ఇంట్లో 2 తులాల బంగారం, 12 తులాల వెండి, లావణ్య ఇంట్లో రూ.6వేల విలువ చేసే ముక్కుపుడక, రూ.2వేల నగదు ఎత్తుకెళ్లారు. తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు చేరుకుని డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్‌తో తనిఖీలు నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గీత కార్మికుడి మృతి

వీణవంక(హుజూరాబాద్): మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో ఉయ్యాల చందర్ గౌడ్(40) అనే గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి పడి, మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందర్ గౌడ్ శుక్రవారం తాటి చెట్టు ఎక్కి, కల్లు గీసి దిగుతుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తోటి గీత కార్మికులు గమనించేలోపే మృతిచెందాడు. ఎస్సై ఆసిఫ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య శ్రీలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. కాగా, గౌడ సంఘం నాయకుడు పల్లె రాజమల్లు గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు పీఈటీ ఎంపిక

కోనరావుపేట(వేములవాడ): రాష్ట్రస్థాయిలో జరిగే ఖోఖో పోటీలకు టెక్నికల్ ఆఫీసర్‌గా కోనరావుపేట మండలం ధర్మారం పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్‌కే మొహియుద్దీన్ ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు ఈనెల 8–10 తేదీల్లో నిజామాబాద్ జిల్లా నందిపేట్‌లో జరుగుతున్నాయి. పోటీలకు ఎంపికైన పీఈటీని ఎంపీపీ చంద్రయ్య, ధర్మారం సర్పంచ్ గున్నాల అరుణ, ఎస్ఎంసీ చైర్మన్ వంగ మాధవి, హెచ్ఎం మురళీనాయక్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు..

జమ్మికుంట(హుజూరాబాద్): పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన ఏడోతరగతి విద్యార్థి ఎం.సిద్ధు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ కుమారస్వామి తెలిపారు. గురువారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచాడన్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి 10 వరకు మంచిర్యాలలో జరిగే అండర్–14 రాష్ట్రస్థాయి హాండ్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.